# దీని పేరు ప్రపంచం

మాహనుమంతరావు

గత రోజునుండి ఎన్నిసార్లు చదివినా తనివితీరని ఆ ఉత్తరాన్ని తిరిగి వణికే చేతులతో ఇంకోసారి చదివింది సునంద.

సునందా డియర్ !

అబ్బా ఎన్నాళ్ళకి తిరిగి కలుసుకున్నాం. కనీసం ఈ ఉత్తరంలోనైనా. మై డియర్ స్వీట్ ఎన్ని రోజులయింది నిన్ను చూసి. ఉద్యోగం కోసం హైద్రాబాద్ వెళ్ళి పోయావు నీవు, నీ ఎడ్రస్ కోసం ఎంత యాతనపడ్డానో చెప్పలేను. మీ అమ్మ నీ ఎడ్రస్ ఎంత గుట్టుగా దాచింది. మీ అమ్మ చనిపోయిన పది రోజులకి వెతగ్గా, వెతగ్గా కనబడ్డాయి నీ ఉత్తరాలు. దేవుడి అరుగుమీద పేపరు క్రింద ఎంత గోప్యంగా దాచింది! నీ ఉత్తరాల్ని చూడగానే నిన్ను చూసినట్లు ఎంత సంబరపడ్డానో చెప్ప లేను. మై డియర్. పూర్ ఆంటి ఎంత కష్టపడింది, నిన్ను నాకు దూరం చేయాలని. అందుకే అనుభవించింది, కడసారిగా నిన్ను చూడలేకపోయింది, నువ్వు కనీసం ఆమె శవాన్నైనా చూడలేక పోయావు సారీ.. మీ అమ్మ చనిపోయిందని ముందుగా రాయలేకపోయాను, మీ అమ్మ పోయిందని తెలియగానే నీ ఎడ్రస్ కోసం గది అంతా వెదికాం నీకోసం వాకబు చేశాం. మా ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి నేనే దహనం చేశాను. సారీ ..మై డియర్.. .వస్తున్నాను...,నీకోసం...నేనిక వుండలేను .

ఇక చదవలేకపోయింది సునంద. దుఃఖ భారంచేత వణికిపోతూ ''అమ్మా నన్ను విడిచి వెళ్ళిపోయావా ? నన్ను వంటరిదాన్ని చేసి పోయావా ?'' అంటూ బిగ్గరగా రోదించింది, అంతలో గది తలుపుమీద చప్పుడయింది. ఆమె వీపుమీద ఎవరో చరిచినట్లయింది. ఉలిక్కిపడింది. ''కేశవరావు. ...కేశవరావు-'' అంటూ

పిచ్చిగా గొణుక్కుంది. ఆమె కళ్ళకి చీకట్లు కమ్ముతున్నాయి. తలుపుమీద చప్పుడు ఉధృతమవుతోంది. భయంతో అనాలోచితంగా తలుపులు తీసింది.

మల్లె పువ్వులాంటి తెల్లని దుస్తులతో సత్యమూర్తి!

అతను లోపలికి వస్తూనే అన్నాడు—

"మీ అమ్మగారు పోయారుటగా ?"

"మీకెవరు చెప్పారు ?" ఆవేశంగా ప్రశ్నించిందా అబల,

"ఆఫీసులో చెప్పారు" నిర్లిప్తంగా సమాధానం.

"ఆఫీసులో పని చేసే ఆడవాళ్ళ ఎడ్రస్‌లు కనుక్కోవడమేనా మీ పని ?" ఆ కోమలి కంఠం కటువుగా పలికింది. ఆమె ప్రశ్నకి సమాధానం చెప్పకుండా అన్నాడతను సానుభూతితో—

"నేనీ వార్త విని చాలా బాధపడ్డాను"

"ఎందుకో ?" కంచులా మ్రోగింది ఆమె కమనీయ కంఠం.

"మీ అమ్మగారు పోయారని విని చాలా విచారిస్తున్నాను" అన్నాడతను తన మామూలు ధోరణిలో సౌమ్యంగా.

"నా ప్రశ్నలకి సమాధానాలు చెప్పడం లేదు"

"క్షమించండి....మీరిప్పుడు చాలా ఆందోళనగా వున్నారు సునందాదేవిగారూ" అతని మాటలకి అడ్డు వస్తూ తీవ్రంగా అంది "యిక్కడ దేవీలూ, రాణులు ఎవ్వరూ లేరు."

"క్షమించండి" అన్నాడు ప్రాధేయ పూర్వకంగా.

"క్షమించండి....క్షమించండి...క్షమిం చడమే మేం నేర్చుకోవాలి. స్త్రీకి క్షమ అవసరం - అంతేనంటారా ?"

"నన్ను మీరు అర్థం చేసుకోవడం లేదు"

"మిమ్మల్ని నేను అర్థం చేసుకొనే లోగా ఈ ప్రపంచం మనల్ని అపార్థం చేసుకుంటుంది."

"మీరు నన్ను చూసి ఎందుకు భయ పడుతున్నారో, బాధపడుతున్నారో ఊహించలేకుండా వున్నాను"

"మీరు నన్నెందుకు వెంబడిస్తున్నారో; పలకరిస్తున్నారో నాకూ అర్థంకాకుండా వుంది."

"మానవుడు సంఘజీవి. మీరు బాధ పడుతున్నారని విని." అతని మాటలకి అడ్డు వస్తూ చురుగ్గా అంది "ఈ సంఘం భౌతికంగా ఎంత విశాలమైనదో మాన సికంగా అంత సంకుచితమైనది. ఈ సంఘంవల్ల చెడిపోయేది మీరు కాదు. నేను."

"మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను" అన్నాడతను తడబడుతూ అనాలోచితంగా.

"షటప్....గెట్ అవుట్" ఆమె కళ్ళల్లో నిప్పులు కురుస్తున్నాయి. కలకత్తా కాళిలా వున్న ఆమెని చూస్తూ గాఢంగా నిట్టూర్చి, బయటికి నడిచాడు సత్యమూర్తి. అతను వెళ్ళి వెళ్ళగానే తలుపులు బిగిం



చింది సునంద.

"అమ్మా....అమ్మా....నన్ను ఒంట రిగా వదిలి వెళ్ళిపోయావా?" అంటూ పిచ్చిగా జుత్తుపీక్కుంటూ ఏడ్వసాగింది.

* * *

సునంద అమ్మ చిన్నతనంలోనే వైధవ్యం పొందింది విధిచేత వంచింపబడింది. యిటు పుట్టింటిని అటు మెట్టింటిని కాదని నా దగ్గర బానిసగా యాంత్రంగా పడి వుండటం యిష్టంలేక తన స్వశక్తితో



ట్టుమిషన్ ఆధారంతో బ్రతికి,. భర్త దూరమయ్యాక భూమిమీద పడిన సుసందని బాధ్యతతో పెంచింది. బి. ఏ. వరకు చదువు చెప్పించింది. ఆత్మ బలమే నీ ఆయువు అంటూ హైద్రాబాద్ పంపింది ఉద్యోగ నిమిత్తమై.

“చాలీచాలని ఆదాయంతో బాధపడుతూ నీకెందుకే ఈ చదువు.... కేశవరావుని పెండ్లి చేసుకోకూడదూ'' అంటూ ఉచిత సలహాలిచ్చిన బంధువులకి “మా అమ్మ

ఆనందంకోసం చదువుతున్నా''నని సమాధానమిచ్చేది సునంద. ''నీకెందుకే ఈ ఉద్యోగాలు .. కేశవరావుకి బోలెడంత ఆస్తి వుంది'' అని అంటే ''మా అమ్మ ఆనందం కోసం చేస్తాను ఉద్యోగం''అనేది సునంద.

ఉద్యోగం చేసి బాగా డబ్బు సంపాదించి తల్లిని సుఖపెడతామనుకున్న సునందకి నేడు తల్లి లేదు. ఉద్యోగంలో చేరగానే తల్లికి ఉత్తరాలు రాసింది. వెంటనే తీసుకు రాలేకపోయింది. జీతాలు రాగానే తీసుకు వద్దామనుకుంది. జీతం తీసుకుని తల్లి దగ్గరకి వెళ్దామనుకున్న రోజునే వచ్చింది ఉత్తరం కేశవరావు దగ్గరనుండి.

కేశవరావు సునందకి దూరపు చుట్టం వివాహితుడు. ''భార్యకి విడాకులిచ్చాను. నిన్ను పెండ్లి చేసుకుంటా''నంటాడు సునందని.

సునంద తల్లి కిష్టంలేదు. కాని, కొంత మంది ఆమె బంధువులు (కేశవరావుచే ప్రేరేపించబడినవారు) తమ కొడుకుల సంగతి మాట్లాడకుండా కేశవరావు-అతని ఆస్తి - గుణం - రూపంగురించి వర్ణిస్తూ లొట్టలు వేస్తూ (తమ కూతుళ్ళని యివ్వడానికి సందేహిస్తారు) సునందనిచ్చి పెండ్లి చేయమని సలహాలిచ్చేవారు. కాని సునందకివేమీ పట్టేవి కాదు. కాలేజీలో చదివింది. చదువుని మాత్రమే. ఈ ప్రేమలూ, పెండ్లిండ్లు గురించి ఎప్పుడూ ఆలోచించేది కాదు. ఆమెకి సదా కనబడేది కుట్టు మిషన్ మీద కూచున్న తల్లి ఆమె కష్టం, తన కర్తవ్యం,

సునంద కాలేజీలో చదువుతున్నప్పుడు ఆమెని వెంబడించి విఫలులైనవారు ప్రేమికులు'' ఆమె ఉద్యోగంలో చేరిన కొద్ది రోజులలోనే ఆమె సమీపానికి రావడానికి సాహసించాడు సత్యమూర్తి ఆమె ఆఫీసుకి వెళ్ళేటప్పుడు. తిరిగి వచ్చేటప్పుడు అనుసరిస్తూ, కావాలని పలుకరిస్తూ, నలుగురు నోళ్ళల్లో పడ్డాడు యిది సునంద కిష్టం లేదు. అప్పటివరకు ఆమె గమ్యం తల్లి సుఖం. ఆఫీసులో చేరిన తరువాత ప్రతీ వెధవా (నైంటీపర్సంట్ ఆమె దృష్టిలో) ఆమె వొంటిమీద దుస్తులు తొలగించి నగ్నంగా చూస్తున్నట్లు ఫీల్ అవుతూ పళ్ళు యికిలించడం ఆమె గమనించింది ఈ ఉద్యోగుల కళ్ళల్లో కాలేజీ విద్యార్థుల కళ్ళల్లోని మృదుత్వం, నిర్మల మందహాసం కనబడకపోగా, కాలుతున్న కోర్కెల కసిత్వం ఆమెకి కనబడింది, అందనిది అందుకోవాలని ఆరాటం.

సత్యమూర్తి చనువుని చిన్న పిల్లవాడి చేష్టగా కొట్టివేసింది. మాధవరావు ఆమె మనసులో వున్నాడు, నలిగిన బట్టలు కట్టడు క్రాఫ్ చెక్కుచెదరనీయడు ఎవరితోనూ ఎక్కువ మాట్లాడడు. తన పని, తన గొడవ మర్యాదస్తుడు. మృదువుగా మాట్లాడుతాడు. తల వంచుకు నడుస్తాడు. ఎవరిని ఆకర్షించ ప్రయత్నించడు. అతనెక్కువగా మాట్లాడేది బట్టతల ముసలి గుమస్తాతో.

* * *

అందుకే ఈ అపరంజి అతనింటికి వెళ్ళింది. అంత బాధలోనూ దుఃఖంలోనూ ఆమెని సదా భయపెట్టేది కేశవరావు రాక అతను వట్టి రౌడీ. జులాయి. అతను వస్తే తన జీవితం ఎంత దుర్భరమవుతుందో ఊహించలేక పోతున్నది. అన్నింటికీ తెగించినవాడు అతను. అందమైన ఈమెని అందుకోకుండా వెళ్ళడు. అందుకే ఆమెకి భయం. ఈ భయ నివారణకై వెళ్ళింది మాధవరావు యింటికి. చీకటి పడిన తరువాత అతనిల్లు కనుక్కోవడం కష్టమయింది ఆమెకి. వీధి గుమ్మంలోనే ఆహ్వానించాడు మాధవరావు.

"ఏదో పనిమీద వచ్చినట్లున్నారు?"

"అవును" అందామె నిర్లిప్తంగా.

"ఏమైనా అర్జంట్ పనా....లేకపోతే ఒక అయిదు నిమిషాలుండండి.. సాయంకాల పూజ పూర్తిచేసి వస్తాను."

"క్షమించండి మీకు యిబ్బంది కలిగిస్తున్నాను.. మా అమ్మగారు పోయింది" అందామె నేలచూపులు చూస్తూ అతను గబగబా .."మీ అమ్మగారు పోయారా! అరే....అరే... పాపం...." అంటూ గాఢంగా నిట్టూర్చి "ఎప్పుడు పోయారు.... మీ స్వగ్రామం వెళ్ళాలా... వెంట పదండి...."

"పోయి చాలా రోజులయింది" అందామె బలహీనంగా.

"మీకెప్పుడు తెలిసింది ?"

"నిన్న....ఈ రోజు నిన్నా కూడా ఆఫీస్‌కి రాలేదు నేను."

"రాలేదా ?" అన్నాడతను సంశయంగా,

"మిమ్మల్ని యిబ్బంది పెడుతున్నట్లున్నాను—నాకో సలహా కావాలి" పమిటచెంగు వేలికి చుట్టుకుంటూ అందామె.

"ఎంత మాట అడగండి."

పెద్దమనిషి తరహాగా అన్నాడు మాధవరావు.

అంతలో వరండాలోకి ఎవరో వచ్చినట్లు అలికిడయింది. ఆమెకేమీ చెప్పకుండా గబగబా బయటికి వచ్చాడు మాధవరావు. చవకరకం సెంటు వాసన గుప్పుమని గాలికి వచ్చి ఆమె ముక్కుపుటల్ని బ్రద్దలు చేసింది. ఆమె విప్పారిన నేత్రాలు చీకటి వెలుగుల మధ్య అతను మాట్లాడుతున్న స్త్రీ నగ్న స్వరూపాన్ని ఆమె కట్టుకున్న దుస్తులలోంచి చూస్తున్నాయి. గాజుల గలగలలు: ఆమె చెవికి సోకని వాళ్ళ సంభాషణ ఆమెని కలవర పెడుతున్నాయి.

అతను లోపలికి వచ్చాడు. ఏదో మాట్లాడాలనుకున్న ఆమె నోరు మూత పడలేదు. కాని మాట్లాడలేక పోయింది.

"పనిమనిషి. సినిమాకి పోతుందట. డబ్బులు కావాలిట" అతనేదో అంటున్నాడు.

సునంద గబగబా గది గుమ్మం దగ్గరకి వచ్చింది.

"గురూ తల్లి వచ్చింది. మనంక్షైఅ

గాలి అన్నావు. అప్పుడే గూటికి చేర్చావా గురూ'' అంటూ గళ్ళచొక్కాలో వస్తున్న బట్టతల మనిషిని చూపి నిశ్చేష్టితురాలై యింది సునంద. ''పయోవిషకుంభాలు.... మృగాలూ....'' అంటూ కపితీరా తిట్టింది. కాని వాళ్లు మృగాలుగానే వస్తున్నారు ఆమె దగ్గరికి. ఆమె కెవ్వున కేకవేసింది.

మాధరరావు ఆమె నోటిని మూయ లేక పోయాడు.

స్వతంత్ర పౌరులందరూ ఆ యింటి దగ్గరికి చేరారు. ''ఏమిటన్నారు-'' ముసలి బట్టతల గుమాస్తా చెబుతున్నాడు. మాధవ రావు అనువదిస్తున్నాడు ఈ రోజుల్లో ఆడవాళ్ళు బరితెగించి పోయారు, తన ఉద్యోగం ఖాయపరచడానికి శ్రీరామ శ్రీరామ అనకూడమగాని'' అంటూ గుట కలు మింగి ''యిటు వంటి నీచపు పనులు మేం చెయ్యం. నీ ఉద్యోగం పోవడం ఖాయం అన్నాం. మామీద పగబట్టింది. మమ్మల్ని అల్లరి చేయడానికి ఈ రగడ ఏర్పాటు చేసింది బాబూ-'' చేతులు జోడి స్తున్నాడు మాధవరావు. అప్పుడే పిల్లలతో రిక్షాదిగిన మాధవరావు భార్య యింటి ముందు జనం; భర్తనీ, సునందనీ చూసి; సంగతి అర్ధం చేసుకుని లోపలికి వెళ్ళి పోయింది.

ఆమెకి భర్త స్వ భా వం తెలుసు అందుకే మాట్లాడలేదు. కాని యింటి ముందున్న ప్రజలకి విషయం తెలీదు. వాళ్ళకి తెలిసినది తమకివాక్ స్వాతంత్ర్యం; స్వేచ్ఛా వున్నాయని. అందుకే స్వాతి శయంతో కళ్ళముందున్న సత్యాన్ని పరీ క్షించాక; చెవులతో విన్నదానికి ప్రాముఖ్య మిచ్చి ఆమెని ముద్దాయిగా నిలబెట్టారు. ఆమె వల్లే సంఘం నాశనమై పోతోందిట. ధర్మం నశిస్తున్నదిట! కరువు కాటకాలు ఏర్పడుతున్నాయట. అన్నిరకాలమాటలు! తాము వల్లెవేసిన పెద్దల సూక్తులు కరువు తీరా అని: కంఠశోష రాగా, ముసలిపీనుగ యిచ్చిన బీడీలతో, మాధవరావు ఇచ్చిన సిగరెట్లతో సంతోషపడి ఆమెకి 'పతిత' అని టైటిల్ యిచ్చి సర్దుకుంది సంఘం. తలుపులు వేశాడు మాధవరావు కరుడు గట్టిన ఆ చీకటిలో కరినశిలలా నిలుచుంది. ఆమె. ఆమెలో చలనం లేదు.

చలనమున్న ముసలి గుమస్తా రెండు మూడు నిమిషాలు రోడ్డుమీద తిరిగి వస్తూ పోతున్న జనం వంక, ఆమెవంక మార్చి మార్చి చూసి 'డామిట్ కథ అడ్డం తిరి గిందని' వెళ్ళిపోయాడు.

అప్పుడు కదిలింది ఆమె.

* * *

ఆగింది ఆమె తాను అనుకున్నగమ్యం రాగానే. కాని ముందుకి వెళ్ళలేక పోయింది. చీకటిలో సముద్రపు అలలు విచిత్రంగా కనిపిస్తున్నాయి ఆమెకి. కదలి కెరటాల కదలికలో అందం కని పిస్తున్నది ఆమెకి. ఆ నీలి ఆకాశంలో మెరిసే నక్షత్రాలు విచిత్రంగా చూస్తున్న నగరాన్ని వెనక్కి తిరిగి చూపించి. ఆ

నగర ప్రజలు దీపావళి చేసుకుంటున్నట్లనిపించింది ఆమెకి. కదిలే వాహనాలు, కదులుతున్న ప్రజ. యంత్రాల ఘోష. దీపాలవెలుగు. ఆ వెలుగులో ఆనందంతో అందమైన ప్రజావాహిని. వారి ఆనందానికి అసూయపడింది. తానా అదృష్టపు ఆనందానికి నోచుకోలేదని బాధ పడింది. తానెందుకు బ్రతకాలి - ఎవరి కోసం ఆమె ఆలోచనలు ఆగాయి. తెల్లని దుస్తులతో మానవాకారం కెరటాలమధ్యలోకి వెళ్ళడం గమనించింది. ఆమె వంటికి కరంటుషాక్ తగిలినట్లయింది ఆమె యాదృచ్ఛికంగా, గబగబా తాను ముందుకి వెళ్ళి అతని చేతిని పట్టుకుని వెనక్కి లాగబోయింది. గాని సముద్ర కెరటం వాళ్ళిద్దరినీ వొడ్డున పడవేసింది.




చల్లని మెత్తని యిసుకమీద యిద్దరు.

రెండు నిముషాల అనంతరం బలహీనంగా కళ్ళు విప్పుతూ అన్నాడతను-

"నేనెక్కడున్నాను?"

యిసుకలో పిచ్చిగీతలు గీస్తున్న ఆమె అంది-

"దీనిపేరు ప్రపంచం."

సత్యమూర్తి గాభరాపడి లేచి కూచున్నాడు.

"మీరెందుకీ సాహసం చేశారు" అందామె తిరిగి.

"మీరు నన్ను గెట్ అవుట్ అన్నారు. వెళ్ళిపోదామని వచ్చాను.... కాని మీరే వచ్చి మళ్ళీ వెనక్కి లాగారు".

ఆమె వంక చూస్తూ అన్నాడు.

'నన్ను ఎందుకురక్షించారో తెలుసుకో వచ్చా?" అన్నాడతను తిరిగి! ఆమె సముద్ర కెరటాలవంక రెండు నిమిషాలు చూసి అంది "నాకోసం."

అతని కళ్ళు ఆనందంతో మెరిశాయి; ఆమె దగ్గరికి వచ్చాడు.